క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఊరేగింపు



కనకదుర్గమ్మ ఊరేగింపు

యలమంచిలి: మేడపాడు గ్రామంలో దసరా శరన్నవరాత్రులు సందర్భంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. గరగల నృత్యాలు, అమ్మవారి ఘటాలు, శక్తి వేషాలు, డీజే సౌండ్స్ మధ్య అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం విగ్రహాన్ని దొడ్డిపట్ల తీసుకెళ్లి వశిష్ఠ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

లబ్ధిదారుల అర్హతపై పరిశీలన



సిద్ధాంతంలో విచారిస్తున్న ఆర్డీఓ దాసిరాజు

పెనుగొండ: జాయింట్ కలెక్టరు ఆదేశాలతో ఇళ్ల స్థలాల దరఖాస్తు దారుల అర్హతపై ఆర్డీఓ డి.దాసిరాజు గురువారం పరిశీలించారు. అర్హులకు ఇళ్ల స్థలాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, హౌసింగ్ ఏఈ బి.లక్ష్మణ్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి దారుణం



అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నరసాపురం: సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. గవాయ్‌పై దాడిని ఖండిస్తు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీజేఐపై చెప్పు విసరడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, న్యాయవాదులు వంగలపూడి జక్కరయ్య, కొరు పెద్దిరాజు, సోడదశి శ్రీధర్, దీపాటి జానకి రాజు, ఈదా జయదాస్, చిన్నం వెంకట్రావు, నెక్కంటి క్రాంతి కుమార్, పూరిళ్ల శ్రీనివాస్, కానూరి బుజ్జి, దొండపాటి స్వాములు, పడవల సత్యనారాయణ, కట్టా వేణుగోపాల్, మోకా శేఖర్ బాబు, పొగాకు పూర్ణ, నల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అట్లతద్ది సందడి



సిద్ధాంతంలో గంగ పూజ చేస్తున్న వధువులు

పెనుగొండ: 'గ్రామాల్లో అట్లతద్ది సందడి నెలకొంది. ఆచంట పోడూరు, పెనుగొండ మండలాల్లో గురువారం ఉదయం నుంచి సందడి చేశారు. ఏన్నాళ్లకు వచ్చావు గౌరమ్మ, ఏడాదికి వచ్చావు గౌరమా, నీ నోము చెల్లించు గౌరమ్మ మా నోము పండింవా గౌరమ్మ' అంటూ ముత్తయిదువులు, నవ వధువులు పట్టు చీరలు ధరించి కాలువ రేవుల్లో గౌరమ్మ గంగ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునే సద్ది భోజనాలు చేసి, కఠిక ఉపవాసం చేసి సాయంత్రం పూజలు చేశారు. అనంతరం వాయినాలు తీర్చు కొన్నారు. గోపూలు, చేసి అమ్మవార్ల దర్శించుకొని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఊయలు ఊగుతూ ఉత్సాహంగా అట్లతద్ది మొక్కులు తీర్చుకొన్నారు. నక్షత్ర దర్శనం చేసుకొని ఉపవాసం ముగించారు.

తోపుడు బండి అందజేత

పాలకొల్లు సెంట్రల్: భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్న పట్టణంలోని పల్లపు వీధికి చెందిన పి.విజయలక్ష్మి అనే మహిళకు పాట్నూరి ఫౌండేషన్ గురువారం తోపుడు బండిని అందజేసింది. ఇంటి వద్దే చిన్న టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడం కోసం ఆమె తమ ఫౌండేషన్‌ను సహాయం కోరగా, ఆ మేరకు అందజేసినట్టు చైర్మన్ పి.అప్పన్న తెలిపారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

నరసాపురం రూరల్: జీఎస్టీపై అవగాహన ర్యాలీ తూర్పుతాళ్లు, ఎల్బీ చర్ల ఆరోగ్య కేంద్రాల వద్ద గురువారం నిర్వహించారు. ఎంపీటీసీ బళ్ల హనుమంతరావు, పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో..

యలమంచిలి: జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని మేడపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ సతీష్ అన్నారు. మేడపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య, ఆరోగ్యాధికారులు రత్నకుమారి, మురుకుర్తి శివకుమార్, మాఘం సురేష్, అక్కమ్మ పాల్గొన్నారు.

క్షీణించిన పారిశుద్ధ్యం

- ఎక్కడి చెత్త అక్కడే
- వీధుల్లో దుర్గంధం
- ప్రజలకు వ్యాధుల భయం
- స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రచారానికే పరిమితమా?



నరసాపురం : కోవెల స్ట్రీట్‌లో పరిస్థితి ఇలా..

నరసాపురం: పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. డ్రెయిన్లలో సిల్టు తొలగించకపోవడంతో మురుగు నీరు ముందుకు పారక దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. పలుచోట్ల ప్రజలు వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అంటూ అవార్డులు, రివార్డులు ప్రకటిస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నరసాపురం మున్సిపాలిటీలో చెత్త డంప్ చేయడానికి స్థలమే లేదు. కొన్ని రోజులుగా ఇళ్ల మధ్య చెత్త డంపింగ్ చేయడంతో స్థానికులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడే వరకూ పరిస్థితి వచ్చింది.

ఆత్మహత్యకు యత్నం

నరసాపురం పట్టణ జనాభా 60 వేలు. పట్టణం 31 వార్డులుగా విస్తరించి ఉంది. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు మొత్తం 116 మంది పనిచేస్తున్నారు. పదేళ్ల క్రితమే పట్టణంలో 150 మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం పట్టణంలో రోజుకు 35 టన్నుల చెత్త వస్తోంది. కాంట్రాక్ట్ సిబ్బంది పనికి హాజరుకాకపోయినా, వారు వచ్చినట్టు చూపించి డబ్బులు దండుకునే తతంగం, లంచాల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. 1956లో నరసాపురం మున్సిపాలిటీ ఏర్పడగా నేటికీ చెత్త వేసేందుకు స్థలం లేదు. దీంతో గోదావరి గట్టున చెత్తను డంప్ చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులు తనిఖీలు చేశారు. గోదావరి గట్టున చెత్తను వేయొద్దని ఆదేశాలిచ్చారు. దీంతో వేములదీవి, సరిపిల్లి గ్రామాల్లో డంపింగ్ యార్డ్ పెట్టాలని చూసినా స్థానికులు వ్యతిరేకించారు. వారంరోజుల క్రితం 28వ వార్డులో ఇళ్ల మధ్య చెత్తను వేయడం ప్రారంభించారు. అయితే స్థానికులు పెద్ద గొడవపెట్టి, పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు.

డ్రెయిన్ల నిర్వహణ అధ్వానం

పట్టణంలోని డ్రెయిన్లలో వేసవిలో సిల్ట్‌తీత పనులకు రూ.20 లక్షలు బిల్లులు పెట్టి తూతూమంత్రంగా నిర్వహించారు. దీంతో కొద్దిపాటి వర్షాలకే డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి మురుగునీరు వచ్చేస్తుంది. రుస్తుంబాధ, రాయిపేట, వైఎస్సార్ నగర్, నందమూరికాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కీలకమైన మార్కెట్ ప్రాంతం, స్టీమర్‌రోడ్డు, కోర్టువీధి, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో కూడా చెత్త కుప్పలు, పొంగుతున్న డ్రెయిన్లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల పందుల బెడద కూడా ఎక్కువైంది. పట్టణంలో రెండు శానిటరీ డివిజన్లు ఉండగా, ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాత్రమే మొత్తం పర్యవేక్షణ చేస్తున్నారు.

రికార్డుల్లోనే ఖర్చు

ప్రతిఏటా బడ్జెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు రూ.లక్షల్లో నిధులు కేటాయిస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు రూ.78 లక్షలు కేటాయించారు. సిల్ట్ తీత పనులకు ఏడాదికి రూ.40 లక్షలు పైనే ఖర్చు చేస్తున్నట్టు మున్సిపల్ రికార్డులు చెబుతున్నాయి. ఈ నిధులు ఏమైపోతున్నాయన్నది పెద్ద ప్రశ్నగా మిగిలిపోతుంది.

చెత్త సమస్య పట్టని పాలకులు



పాలకొల్లు సెంట్రల్: ఆర్యవైశ్య మండపం ఎదురుగా రోడ్డుపై ఉన్న చెత్త

పాలకొల్లు సెంట్రల్: స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదం ప్రకటనలకే పరిమితమవుతోంది. క్షేత్ర స్థాయిలో ఎక్కడకక్కడ చెత్త కనిపిస్తునే ఉంది. పాలకొల్లులోని వాసవి ఆర్యవైశ్య సత్రం ఎదురుగా ఉన్న చిన్న రోడ్డులో చెత్త పేరుకుపోయి ఉంది. ఇదంతా చినగోపురం సందులోని నివాసితుల ఇళ్ల నుంచి వచ్చిన చెత్తేనని చెబుతున్నారు. ఈ చెత్త కారణంగా ఇళ్లలోకి పాములు, జలగలు, దోమలు, విష పురుగులు వచ్చేస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే సాక్షాత్తూ మంత్రి నివాసం ఉండే వార్డులోని రోడ్డు జలమయమయ్యాయి. ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగించారు. తమ సమస్యను పట్టించుకునే నాథుడు లేరని ప్రజలు వాపోతున్నారు.

సిబ్బంది కొరత

వందేళ్లు పూర్తిచేసుకున్న మునిసిపాలిటీల్లో పాలకొల్లు పురపాలక సంఘం జిల్లాలో రెండోది. పట్టణ వార్డులు 31. జనాభా సుమారు 90 వేలు. 164 మంది ఉండాల్సిన శానిటరీ వర్కర్లు నేడు 130 మంది వరకు ఉన్నారు. వీరిలో సగం మంది కాంట్రాక్టు కార్మికులు. ఖాళీ అయిన పోస్టుల్లో నియామకాలు చేయడం లేదు. సిబ్బంది కొరత కారణంగా డ్రెయిన్లు శుభ్రం చేయడంలేదు. డ్రెయిన్లలో సిల్ట్ పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుంది.

బడ్జెట్ కేటాయింపు రూ.7 కోట్లు

మునిసిపల్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగానికి దాదాపు రూ.7 కోట్లు బడ్జెట్ కేటాయిస్తున్నారు. ఇందులో ఒప్పంద కార్మికులు, డ్రైవర్ల జీత భత్యాలకు రూ.3.55 కోట్లు, వాహనాలు ఆయిల్‌కు రూ.75 లక్షలు, పారిశుద్ధ్య సామగ్రికి రూ.15 లక్షలు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, దోమల నివారణకు రూ.12 లక్షలు, సబ్బులు, ఆయిల్స్, యూనిఫామ్, గ్లౌస్, ఇతర రక్షణ సామగ్రికి రూ.28 లక్షలు, అద్దె ట్రాక్టర్లు, క్లాప్ ఆటోల అద్దెలకు రూ.1.58 కోట్లు, ఇలా ఇంకా ఇతర ఖర్చులకు వెచ్చిస్తున్నట్టు చెబుతున్నారు.

డంపింగ్ యార్డ్ కూడా లేదు



మున్సిపాలిటీకి చెత్త వేయడానికి జాగా కూడాలేదు. గోదావరి గట్టున చెత్త వేయొద్దని గ్రీన్ ట్రిబ్యునల్ చెబితే ఇప్పుడు 28వ వార్డులో దళితుల ఇళ్ల మధ్య కాలువ గట్టున పోస్తున్నారు. ఇదెక్కడి దారుణం. మెయిన్ బజార్ సెంటర్‌లో కూడా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అవార్డులు ఏమిటో అర్థం కావడంలేదు.

– అడిదల శరత్, స్టేషన్‌పేట, నరసాపురం



నరసాపురం : బస్టాండ్ వద్ద మురుగుపారని డ్రెయిన్



నరసాపురం : స్టీమర్ రోడ్డు కనకదుర్గ ఆర్చి వద్ద డ్రెయిన్ దుస్థితి



నరసాపురం : చెత్తతో నిండిన గోదావరి గట్టు



పాలకొల్లు సెంట్రల్: మంత్రి నివాసం సమీపంలోని రోడ్డు (ఫైల్)

పల్లెల్లో ఏదీ స్వచ్ఛత?

పెనుగొండ: పారిశుద్ధ్యంపై రోజుకో సమీక్ష.. గంటకో ఆదేశం.. తడి, పొడి చెత్త హడావిడి. సంపద సృష్టి ఇవన్నీ హుళక్కే. పల్లేలు దూసుకు వెళుతున్నాయంటూ చేస్తున్న హడావిడి అంతా హంబక్కే. గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే కుళ్లి దుర్వాసనలు వెదజల్లుతోంది. పెనుగొండ మండలం ములపర్రు, పితాని వారిపాలెం, రాజన్న చెరువు, సీతారాముని చెరువు వంటి ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. డ్రెయిన్లలో సిల్ట్ తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు పెరిగిపోయి విషజ్వరాలు వెదజల్లుతున్నాయి. ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. దొంగరావిపాలెం కూడలిలో డ్రెయినేజీలో సిల్టు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ప్రయాణికులు ముక్కు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. సిద్ధాంతంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రేవుల నిర్వహణదారుణంగా ఉంది. వర్షం పడితే చాలు గరగాలమ్మ డ్రెయిన్‌లోని మురుగు అంతా ఆయా ప్రాంతాల వాసులను బెంబేలెత్తిస్తుంది. మేజరు పంచాయతీ పెనుగొండలోనూ సిబ్బంది కొరత కొట్టుమిట్టాడుతుంది. ఇటీవల ఆర్భాటంగా డ్రెయినేజీల నిర్మాణాలు చేపడతామంటూ ప్రకటించినా ప్రతిపాదనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం డైవర్సన్‌తోనే కాలం వెల్లబుచ్చుతున్నారని, ఆచరణలో శూన్యమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



పెనుగొండ: ములపర్రులో సిల్ట్ పేరుకుపోయిన డ్రెయినేజీ



పెనుగొండ: పితాని వారి పాలెంలో పారిశుద్ధ్యం పరిస్థితి



పెనుగొండ: పెనుగొండ సొసైటీ వద్ద దుస్థితి



పెనుగొండ: దొంగరావిపాలెం హైవే వద్ద డ్రెయినేజీ దుస్థితి



పెనుగొండ: సిద్ధాంతంలో కాలువ రేవు దుస్థితి

వైఎన్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్



కళాశాలలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో గురువారం మేరా యువ భారత్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, కళాశాల స్పోర్ట్స్ డిపార్టుమెంటు, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ని నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, జావెలిన్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతపల్లి కనకారావు, నెహ్రూ యువ కేంద్ర యూత్ కోఆర్డినేటర్ కోసూరి రాజేష్, వైస్ ప్రిన్సిపాళ్లు కేఎస్‌వీ రంగారావు, బి.వెంకట రత్నం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ఆర్డీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, తెలుగు విభాగాధిపతి ఎస్ యాకోబ్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ కోపల్లె నాగభూషణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ ఎస్వీకేపీలో విజేతలు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెనుగొండ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువభారత్‌ల ఆధ్వర్యంలో పెనుమంట్ర బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలల ప్రాంగాణంలో నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల సెమినార్ హాల్‌లో బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.శుభాకర రావు, రామకృష్ణలు కళాశాల పడీ బాపిరెడ్డి, ఏఎస్ఓ సాయి కల్యాణ్, యువ భారత్ అధికారి జుత్తిగ అరుణసాయి, జుత్తిగ జాన్సీ, ప్రసన్నలు పాల్గొన్నారు.

25లోపు పంట నమోదు చేయించుకోవాలి

యలమంచిలి: వరి సాగు చేసే రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ పంట సూపర్ చెక్ రికార్డుల సామాజిక తనిఖీ నిమిత్తం గురువారం ఆయన ఇలపకుర్రు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ పంట నమోదైతేనే ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 2,11,975 ఎకరాలు వరి సాగుచేయగా, ఇప్పటి వరకు 2,08,529 ఎకరాలు ఈ పంట నమోదయినట్టు చెప్పారు. మిగిలిన వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులందరూ అక్టోబర్ 25లోపు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దుంగా బాలాత్రిపుర సుందరి, గ్రామ రెవెన్యూ అధికారి టి.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రాజశేఖర్ తదితర రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

భీమవరం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం నిమిత్తం భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల్లో డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పత్రికా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల వరకూ తీసుకువెళ్లడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ నెల 18న అసంఘటిత కార్మికులు, బాలల కొరకు ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించుటకు న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేయనున్నామని, రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఏ, లేబర్ డిపార్ట్‌మెంట్ , మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులు భాగమవుతారని, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

పేద బాలిక చదువుకు ఆర్థిక సాయం



రూ.25 వేలు సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత రఘురాం

పెంటపాడు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం పేద బాలిక పోతంశెట్టి రూపకు విద్య నిమిత్తం రూ.25 వేలు సాయంగా అందించారు. బుధవారం రాత్రి తన ఇంటి వద్ద ఆ బాలికకు ఆ మొత్తాన్ని అందజేశారు. బాలిక స్వగ్రామం పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం. ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత విద్యకు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లి జయశ్రీ అనారోగ్య కారణాలు అడ్డుగా రావడంతో స్థానిక రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ గ్రూపును ఆమె సాయం కోరింది. ఆ గ్రూపులో సభ్యుడిగా ఉన్న వడ్డి రఘురాం తక్షణం స్పందించి బాలికకు సాయం అందించారు. ఆర్థిక, అనారోగ్య కారణాల వల్ల చదువు ఆపవద్దని, సాయం కోసం తనను సంప్రదించాలని సూచించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు వడ్డి రఘురాంకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బాణసంచా గోదాము తనిఖీ

ఆకివీడు: దీపావళి బాణ సంచా విక్రయాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని అజ్జమూరు ప్రాంతంలోనూ, స్థానిక హోల్‌సేల్ , రిటైల్ వ్యాపార కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన సమీక్షించారు.